క్లుప్తంగా

డీఎస్సీ అభ్యర్థుల వినతి



మాట్లాడుతున్న అభ్యర్థులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): డీఎస్సీ పోస్టుల్లో ఓసీలతో బీసీలను కలపొద్దని అభ్యర్థులు ఎం.శ్రీనివాసులు, పి.సుధీర్‌కుమార్ కోరారు. మంగళవారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2025 డీఎస్సీలో టీజీటీ, పీజీటీలో ప్రొఫిషియన్సీ టెస్టులో ఎస్సీ అభ్యర్థులకు 50 శాతం ఇవ్వగా, బీసీలకు ఓసీ అభ్యర్థులకు సమానంగా 60 శాతం క్వాలిఫై మార్కులివ్వడం సరికాదన్నారు. దీంతో అనేకమంది బీసీలు డీఎస్సీ పోస్టుల్లో ఉద్యోగాలు కోల్పోతారన్నారు. సీఎం, విద్యాశాఖ మంత్రి స్పందించాలన్నారు. ఆర్.ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనం పరామర్శ



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు(ఆర్‌ఎస్‌ఆర్)ను రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి పరామర్శించారు. ఆర్‌ఎస్‌ఆర్ ఇటీవల చిన్న ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో 20వ డివిజన్ కొండాయపాళెంలోని నివాసానికి ఆనం వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

మార్కెట్ సెక్రటరీకి సన్మానం



నెల్లూరు(పొగతోట): లక్ష్యాలను పూర్తి చేసి స్వాతంత్ర్య దినోత్సవం రోజున కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ ఎం.శ్రీనివాసులును మంగళవారం వ్యాపారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామ్, లక్ష్మణ్, అజీజ్, సురేష్, లక్ష్మణరాజు, సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

కఠినంగా ఉండొద్దు



ఏడీతో మాట్లాడుతున్న రమేష్

నెల్లూరు రూరల్: దివ్యాంగుల పెన్షన్ల తొలగింపులో కఠిన వైఖరి ప్రదర్శించవద్దని, వారు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బీజేపీ నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆయూబ్‌ఖాన్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్లలో ఎక్కువమంది డాక్టర్లు పర్సంటేజీ తగ్గిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. రెండు కర్రల సపోర్టుతో నడిచే వ్యక్తికి పర్సంటేజ్ ఎంత ఉన్నా సామాన్యులతో సమానం కాదని, ఇటువంటి దివ్యాంగులకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించాలన్నారు. పెన్షన్ సదుపాయం పొందాలంటే బీపీఎల్ మార్గదర్శకాల్లోనూ ఉదాసీనంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని దేవరపాళెం, కొండ్లపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖాధికారిణి శ్రీదేవి మాట్లాడుతూ వరి పంట వేసిన రైతులు తప్పనిసరిగా వివరాలు నమోదు చేయించాలన్నారు.

పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని పొట్టేపాళెం గ్రామంలో రూ.1.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరిగేదెలా?

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు
- ప్రజలకు అవస్థలు
- ప్రమాదాలతో గాయాలపాలవుతున్న ద్విచక్ర వాహనదారులు

అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజల పాలిట శాపంగా మారింది. రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రహదారులు తవ్వి పనులు పూర్తయిన తర్వాత పట్టించుకోకపోవడంతో రోడ్లు దారుణంగా మారాయి.

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో భూగర్భ డ్రెయినేజీ పనులు ఎప్పటికి పూర్తవుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ పనులు నేటికీ పూర్తికాకపోవడం, మరోవైపు ఇంకా మిగిలి ఉన్న ప్రాంతాల్లో పనులు చేపట్టడంతో ఆయా ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా తయ్యారయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

ఇక్కడిలా..

4వ డివిజన్ పరిధిలోని మారుతి నగర్‌లో ఇటీవల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపట్టారు. ఇందుకోసం అంతర్గత రోడ్డును తవ్వారు.



మారుతి నగర్‌లో భూగర్భ డ్రెయినేజీ పనుల తర్వాత చిన్నపాటి వర్షానికే రోడ్డుపై ఇలా..

అయితే పని పూర్తయిన తర్వాత రోడ్డు వేయకుండానే తవ్వేసిన దానిని మట్టితో పూడ్చేసి వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షానికే గుంతలమయమైన అంతర్గత రోడ్డులో వర్షపునీరు నిల్వ చేరి రొచ్చురొచ్చుగా తయారైంది. అంతేకాకుండా రోడ్డు అంతా బురదమయమైంది. కనీసం పాదచారులు నడిచేందుకు వీల్లేక నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించే క్రమంలో అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు.

రోడ్లు లేక అవస్థలు

నగరంలోని భగత్‌సింగ్ కాలనీ, మారుతి నగర్, పర్చూరువారివీధి, హరనాథపురం, తదితర ప్రాంతాల్లో చేపట్టిన భూగర్భ డ్రెయినేజీ పనులతో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీనికితోడు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇవి మరింత అధ్వానంగా తయారయ్యాయి. భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తి కాగానే టెస్టింగ్ చేసి అంతా బాగుందని అనుకున్న వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. అయితే ట్రైల్ రన్ చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారు. ఇలా ఎంత కాలమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. త్వరతిగతిన సిమెంట్ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బహుళ ఏకాదశి

నెల్లూరు(బృందావనం): శ్రావణ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని నవాబుపేటలోని శ్రీకృష్ణధర్మరాజ స్వామి దేవస్థానంలో మంగళవారం మహిళలు సంపూర్ణ భగవద్గీతలోని 700 శ్లోకాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా గీతావైభవ్ ట్రస్ట్ చైర్మన్ నజీర్‌బాషా గురూజీ గీతా వైభవంపై ఉపన్యసించారు. అర్చకులు మల్లవరపు లక్ష్మీనరసింహారావు మాట్లాడారు. భగవద్గీత శిక్షకులు తన్నీరు సవితారాణిని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కంచి జ్ఞానేంద్ర ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జ్యోతిష్య పురోహితులు గుండాపంతుల రామసుబ్రహ్మణ్యశర్మ, కార్యనిర్వహణాధికారి తదితరులు పాల్గొన్నారు.



శ్లోకాలను పారాయణం చేస్తున్న మహిళలు

మర్యాదపూర్వకంగా..



ఆనం విజయకుమార్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తూ..

నెల్లూరు సిటీ: చింతారెడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్, పొమూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు గంగాసాని లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీసునంద, రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం కార్యదర్శి వెంకటజ్యోతి, నెల్లూరు జిల్లా అధ్యక్షురాలు లావణ్య, జిల్లా మహిళా విభాగ కార్యదర్శి సుభాషిణి, రూరల్ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు రమాదేవి, పొమూరు టౌన్ అధ్యక్షురాలు పద్మ, ఇంకా శారద, బషీర, హైమ, పీవీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు

నెల్లూరు(బృందావనం): శ్రావణమాసం 4వ మంగళవారం సందర్భంగా శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో అమ్మవారు ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. తొలుత మూలవర్లకు ప్రధాన అర్చకులు సూరావఝుల రఘురామమూర్తి ఆధ్వర్యంలో పూజల్ని విశేషంగా నిర్వహించారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన రెడ్డి పర్యవేక్షించారు.



ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం నెల్లూరు నగర శాఖలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సౌత్‌జోన్ బెంగళూరు ఇన్‌చార్జి అంబికాదీదీ మాట్లాడుతూ విద్యార్థుల్లో బాల్యం నుంచి నైతిక విలువలు పెంపొందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచశాంతి కోసం విద్యాలయం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా ఇన్‌చార్జి బ్రహ్మకుమారి ప్రసన్న, రాధిక, శిరీష, సుప్రియతోపాటు బుచ్చిరెడ్డిపాళెం, గూడూరు, విడవలూరు తదితర ప్రాంతాలకు చెందిన బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత ఎన్నికల కమిషన్ అసంబద్ధ సమాధానాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీకి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ వారు చెప్పినట్లుగా ఓట్లు తారుమారు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నేతలు సుధీర్, అల్లా వుద్దీన్, రెహమాన్, మల్లికార్జునరెడ్డి, సుజాత, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



దాడి చేశారని ఫిర్యాదు

నెల్లూరు సిటీ: కొందరు తమ కార్యాలయంలో సామగ్రిని ధ్వంసం చేసి, దాడి చేశారని ఓ వ్యక్తి వేదాయపాళెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. త్యాగరాజ్ నగర్‌లో కపిల్ చిట్ ఫండ్స్ కంపెనీలో కలెక్షన్ మేనేజర్‌గా కె.వెంకట రామాంజనేయులు పనిచేస్తున్నాడు. సూళ్లూరుపేట బ్రాంచ్‌లో అదే ప్రాంతానికి చెందిన టి.భాస్కర్‌రెడ్డి రూ.25 లక్షల చిట్స్ 8, రూ.10 లక్షల చిట్ ఒకటి వేశాడు. వాటిని పాడి డబ్బులు తీసుకున్నాడు. అయితే ఆ నగదు చెల్లించకపోవడంతో డీఫాల్టర్‌గా చూపారు. ఈ అంశం కోర్టులో నడుస్తోంది. ఈ సమస్యలు పరిష్కరించుకునేందుకు వేదాయపాళెంలోని తమ కార్యాలయం వద్దకు రావాలని భాస్కర్‌రెడ్డికి వెంకటరామాంజనేయులు చెప్పాడు. భాస్కర్‌రెడ్డి మంగళవారం ఉదయం ఆరుగురితో వెళ్లి కార్యాలయ అద్దాలను పగలగొట్టాడు. రామాంజనేయులును తిట్టి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాంటేషన్ ప్రక్రియ వేగవంతం

- డ్వామా పీడీ గంగాభవాని

నెల్లూరు(పొగతోట): ప్లాంటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. మంగళవారం నగరంలోని కార్యాలయం నుంచి ఏపీఓలు, ఈసీలు, టీఏలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఒకే ప్రాంతంలో 10 నుంచి 20 ఎకరాల భూములుండే రైతులు ముందుకు వస్తే జామ, నేరేడు తదితర పండ్ల తోటలు సాగు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలు సాగు చేసే రైతులకు మూడు సంవత్సరాలు మొక్కల పర్యవేక్షణకు నిధులు మంజూరు చేస్తామన్నారు. పంట కుంటలు, ఇంకుడుగుంతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్ దగ్గర ఉన్న అబైడింగ్ హోప్ ట్రస్ట్ (ఏహెచ్‌టీ) కార్యాలయంలో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు ఆ ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ మార్నెల్ల టైటస్ నిర్మల్‌కుమార్ పౌష్టికాహారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ హాజరయ్యారు. ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా నిర్మల్‌కుమార్ కిట్లు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. వివిధ రంగాలు, సంస్థలకు చెందిన నిర్వాహకులు ఎ.జయప్రకాష్, వేణు, మధు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బీవీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫోన్ ఇన్ వన్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నందున బుధవారం పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లుగా నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, మినీ బైపాస్ రోడ్డు, రవీంద్రనగర్, వనంతోపు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు సరఫరా ఉండదన్నారు.

సర్వీస్ రిక్వెస్ట్‌లను సకాలంలో పూర్తి చేయండి

నెల్లూరు(బారకాసు): అడ్మిన్ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న సర్వీస్ రిక్వెస్ట్‌లను వేగవంతంగా క్లియర్ చేయాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు సూచించారు. రెవెన్యూ శాఖ వారాంతపు సమీక్షను ఎస్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐజీఆర్‌ఎస్ అసెస్మెంట్లను క్రమం తప్పకుండా పరిశీలించి ఆన్‌లైన్‌లోనే పూర్తిచేయాలని సూచించారు. ట్యాక్స్ రివిజన్ సర్వే ద్వారా సేకరించిన డేటా మేరకు నూతన భవనాలను పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నారు. అదనపు అంతస్తులకు పన్నులను విధించాలన్నారు. ఖాళీ స్థలం, డ్రెయినేజీ పన్నులను వంద శాతం వసూలు చేయాలని సూచించారు. పన్ను బకాయిలున్న అన్ని ఖాళీ స్థలాల్లో యజమానులకు సూచనలు జారీ చేస్తూ నోటీసు బోర్డులు ప్రదర్శించాలని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమద్, సూపరింటెండెంట్ చినబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

కోవూరు: మండల పరిధిలో పేదల గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంజినీరింగ్ అసిస్టెంట్ తమ పరిధిలో జరుగుతున్న పేదల గృహ నిర్మాణాలను రోజూ పరిశీలించాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనుల్లో వస్తున్న ఇబ్బందులను గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పనులు పూర్తి కాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చూపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్వో ప్లాంట్, కంప్యూటర్ వితరణ

నెల్లూరు(టౌన్): స్థానిక కర్నాలమిట్టలోని మున్సిపల్ హైస్కూల్‌కు మంగళవారం వీఆర్సీ సెంటరులోని ఐడీబీఐ బ్యాంక్ అధికారులు సీఎస్సార్ ఫండ్స్ కింద ఆర్వో ప్లాంట్, కంప్యూటర్, మైక్, రెండు బీరువాలను వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో ఐడీబీఐ ఆర్ఓ చందన్, బ్రాంచ్ మేనేజర్ బాలాజీ, రిలేషన్‌షిప్ మేనేజర్ బాబయ్య, టెరిటోరియల్ మేనేజర్ దినకర్, హెచ్ఎం శివరాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన

నెల్లూరు(టౌన్): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం భక్తవత్సలనగర్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లైంగికదాడులు, బాల్య వివాహాలు, పోక్సో యాక్ట్, శక్తి యాప్, ర్యాగింగ్, డయల్ 112 తదితర అంశాల గురించి వివరించారు. సీఐ మాట్లాడుతూ మహిళలు ఆత్మగౌరవానికి భంగం కలిగించినా, వారితో అమర్యాదగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీహరి, సతీష్, ప్రిన్సిపల్ ద్రాక్షాయిణి, శక్తి టీమ్ సిబ్బంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ కృష్ణారెడ్డి

ఉధృతంగా పోరాటాలు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రానున్న రోజుల్లో కార్మికులను ఏకం చేసి పోరాటాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు పిలుపునిచ్చారు. సీఐటీయూ నగర 11వ మహాసభను మంగళవారం పప్పులవీధిలోని జేసీస్ భవన్‌లో కామ్రేడ్ ఆర్.కృష్ణయ్య, కామ్రేడ్ పిడుగు మురళి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా లేబర్ కోడ్‌ను తీసుకొచ్చిందని ఆరోపించారు. విశాఖ ఉక్కులాంటి పరిశ్రమలు ప్రయివేటీకరణ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 46 మందితో కమిటీని, 13 మందితో ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అత్తిమూరు శ్రీనివాసులు, కార్యదర్శిగా జి.నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా రాంబాబు వ్యవహరిస్తారు.



మహాసభలో పాల్గొన్న నాయకులు

అనంతరం ర్యాలీ నిర్వహించి శెట్టిగుంటరోడ్డులో బహిరంగసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్, కార్యదర్శి అజయ్‌కుమార్, రూరల్, నగర నాయకులు పెంచలనరసయ్య, కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, సుధాకర్, కాయంబు శ్రీనివాసులు, కామాక్షమ్మ, అశోక్, మూలం ప్రసాద్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అంగన్‌వాడీ వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ నెల్లూరు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, పెంచలనరసయ్య డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రూరల్ మూడో మహాసభ మంగళవారం వేదాయపాళెంలోని మన్సూర్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా హామీలు నెరవేర్చలేదన్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నాగభూషణమ్మ, సంపూర్ణమ్మ, కోశాధికారిగా రత్నమ్మ, ఆఫీస్ బ్యారెర్లుగా వెంకటకుమారి, సారమ్మ, రాణి నియమితులయ్యారు. కార్యక్రమంలో షాహీనా బేగం, ఖాజావలీ, సుధాకర్, షబ్బీర్, కృష్ణమూర్తి, రమ, నాగభూషణం, సునీత తదితరులు పాల్గొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

త్రిపుర సుందరీదేవిగా కన్యకాపరమేశ్వరి

నెల్లూరు(బృందావనం): శ్రావణమాస నాలుగో మంగళవారం సందర్భంగా స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. ఉభయకర్తలుగా వడ్లపూడి శ్రీరాములుశెట్టి, మస్తానమ్మ, సముద్రాల వెంకట శ్రీనివాసులు, మస్తానమ్మ వ్యవహరించారు. సాయంత్రం పూలంగిసేవ విశేషంగా జరిగింది. రాత్రి 8 గంటలకు శ్రీసౌభాగ్య పూజ నిర్వహించారు. 108 మంది మహిళలకు పసుపుకుంకుమ, గాజులు అందజేశారు. ఉభయకర్తలుగా జి.వెంకట సుధాకర్, పద్మావతి వ్యవహరించారు. కార్యక్రమాలను పాలకమండలి కమిటీ పర్యవేక్షించింది.



విజయవంతంగా స్టెమ్ సెల్ మార్పిడి

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని మెడికవర్ కేన్సర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మల్టిపుల్ మైలోమాతో బాధపడుతున్న రోగికి ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఆటో లోగస్ స్టెమ్ సెల్ మార్పిడి చికిత్సను విజయవంతంగా అందించామని అంకాలజిస్ట్ డాక్టర్ రంగరామన్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో వివరాలు వెల్లడించారు. తిరుపతికి చెందిన 57 ఏళ్ల వ్యక్తికి మల్టిపుల్ మైలోమా అనే రక్త కేన్సర్ వచ్చిందన్నారు. అతని ఆరోగ్యవంతమైన మూలకణాలను (స్టెమ్ సెల్స్) సేకరించి భద్రపరిచామన్నారు. తర్వాత రిస్క్ తీసుకుని రోగి కేన్సర్ కణాలను నాశనం చేసేందుకు అధిక మోతాదులో కీమోథెరపీ ఇచ్చి కోలుకునేలా చేశామన్నారు. తర్వాత భద్రపరిచిన మూల కణాలను తిరిగి రోగి శరీరంలోని రక్తంలోకి ప్రవేశపెట్టామన్నారు. 14 రోజులకే ఆయన కోలుకున్నాడని డిశ్చార్జి చేస్తున్నామని వివరించారు. రంగరామన్ బృందాన్ని సెంటర్ హెడ్ రంజిత్‌రెడ్డి అభినందించారు. కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ పవన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రంగరామన్



ఎమ్మెల్సీ అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్ గంగసాని లక్ష్మి మంగళవారం పొదలకూరురోడ్డులోని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.